తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
గురువారం
13 నవంబర్ 2025
సంపుటి 86
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00
Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

### – జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ

- మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం
- ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
- రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం

2



## డిసెంబర్ 20 డెడ్ లైన్



- అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి
- నాణ్యతతో రాజీపడేది లేదు
- తేడా వచ్చిన ఉపేక్షించేది లేదు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

2

# భూటాన్ నుంచి నేరుగా ఆసుపత్రికి ప్రధాని మోదీ..

## - ఎర్రకోట పేలుడు బాధితులకు పరామర్శ





తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : భూటాన్ పర్యటన ముగించుకుని నేడు దేశానికి తిరిగి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విమానాశ్రయం నుంచి నేరుగా ఢిల్లీలోని లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ ఆసుపత్రికి వెళ్లారు. ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడులో గాయపడి అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రెండు రోజుల భూటాన్ పర్యటన అనంతరం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ప్రధాని, ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వివరాలను, బాధితులకు అందుతున్న వైద్యాన్ని గురించి వైద్యులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు భూటాన్ పర్యటనలో ఉండగానే ప్రధాని మోదీ ఢిల్లీ పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "ఢిల్లీలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధను నేను అర్థం చేసుకోగలను. ఎంతో భారమైన హృదయంతో ఇక్కడికి వచ్చాను. ఈ దుఃఖ సమయంలో దేశం మొత్తం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుంది. మన ఏజెన్సీలు ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తాయి. బాధ్యులైన వారందరినీ చట్టం ముందు నిలబెడతాం" అని భూటాన్ రాజధాని థింపులో ప్రధాని వ్యాఖ్యానించారు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన ఎన్ఐఏ**

మరోవైపు, ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ పేలుడు ఘటన దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముమ్మరం చేసింది. కేసు విచారణ కోసం 10 మంది అధికారులతో కూడిన ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఎన్ఐఏ ఏడీజీ విజయ్ సఖారే నేతృత్వంలోని ఈ బృందంలో ఒక ఐజీ, ఇద్దరు డీఐజీలు, ముగ్గురు ఎస్పీలు, మిగిలిన వారు డీఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారని అధికార వర్గాలు బుధవారం తెలిపాయి. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మంగళవారం ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకి అప్పగించిన విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉన్నతస్థాయి భద్రతాధికారులతో సమావేశమై దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను వీలైనంత త్వరగా పట్టుకోవాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. "దోషులను పట్టుకోవడంలో ఏ ఒక్క అంశాన్నీ విడిచిపెట్టం" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఐఏ, ఐబీ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. ఇది గరిష్ఠ నష్టం కలిగించే లక్ష్యంతో జరిపిన ఆత్మాహుతి దాడి అయి ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. వెయ్యికి పైగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తున్నామని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. పేలుడు జరిగిన ప్రాంతంలోని మొబైల్ ఫోన్ డంప్ డేటాను సేకరించి విశ్లేషిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, ముంబై నగరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రార్థనా స్థలాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

- భూటాన్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన ప్రధాని మోదీ
- ఢిల్లీలోని లోక్ నాయక్ జైప్రకాశ్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడిన వైనం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

## డీజీపీకి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

### – పోలీసు అధికారుల సంఘం డిమాండ్

- డీజీపీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న పోలీసు అధికారుల సంఘం
- పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేస్తోందని వెల్లడి
- సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని సూచన

తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : తెలంగాణ రాష్ట్ర డీజీపీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఖండించింది. డీజీపీ శివధర్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని సంఘం పేర్కొంది. గతంలో ఎన్నడూ లేనంత అప్రమత్తతతో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని తెలిపింది. రాష్ట్ర పోలీసు విభాగం చట్టానికి, ప్రజలకు ప్రాధాన్యతనిస్తోందని స్పష్టం చేసింది. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తిస్తోందని సంఘం పేర్కొంది. కేటీఆర్ ప్రస్తావించిన అన్ని ఘటనల్లో చట్ట ప్రకారం, నిష్పక్షపాతంగానే కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారుల సంఘం తెలిపింది. డీజీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఉపసంహరించుకుని, పత్రికా ముఖంగా క్షమాపణ కోరాలని డిమాండ్ చేసింది. సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని గుర్తు చేస్తున్నట్లు పేర్కొంది. పోలీసు శాఖకు పింక్, రెడ్ బుక్ అంటూ ఏమీ లేవని, తమకు ఉన్నదల్లా పోలీసు బుక్ మాత్రమేనని, చట్ట ప్రకారం నడుచుకోవడమే తమ విధి అని డీజీపీ శివధర్ రెడ్డి ఇటీవల అన్నారు. డీజీపీ చేసిన వ్యాఖ్యలను విమర్శిస్తూ, కేటీఆర్ ఉపయోగించిన భాషపై రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది.



# ఢిల్లీ పేలుడు కేసు

## - ఉమర్ నబీ పేరు మీద మరో కారు.. స్వాధీనం



- ఎర్రకోట సమీపంలో పేలిపోయిన ఐ20 కారు
- నిందితుడి పేరుపై మరో కారు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు
- ఫరీదాబాద్ జిల్లాలో ఖాండవాలీ గ్రామంలో ఎరుపు రంగు కారు స్వాధీనం

2

## అలాంటి వాహనాలపై భారీగా పెనాల్టీ వేయండి - మంత్రి పొన్నం

- నిబంధనలు ఉల్లంగిస్తున్న వాహనాలపై పెనాల్టీ విధించాలన్న మంత్రి
- ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- మహిళా ఆటోల అనుమతులకు సానుకూలంగా ఉన్నట్లు వెల్లడి

తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై భారీగా పెనాల్టీ విధించాలని స్పష్టం చేశారు. ఓవర్ లోడింగ్ వాహనాలు సీజ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బుధవారం ఆయన రవాణా శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిరంతరం ఉండేలా ప్రణాళికను రూపొందించుకుని, దానిని నిక్కచ్చిగా అమలు చేయాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ సేఫ్టీ మంత్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మహిళా ఆటోలకు అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు.



# తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

## - జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈరోజు జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు. వాస్తవానికి ఈ కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం.

# డిసెంబర్ 20 డెడ్ లైన్





మొదటిపేజీ తరువాయి..

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 12, తరంగాలు : శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.బుధవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం కు హెలికాప్టర్ లో 11 గంటల 30 నిముషాలకు చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృ ద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సి,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్ పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు అనంత రం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యావరణ, అటవీ దేవా దాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సి,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ లు మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.అనంతరం మంత్రులు మేడారం హరిత కాకతీయ హొటల్ లో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ లతో కలసి సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి, మాస్టర్ ప్లాన్ రూపకల్పన పై కూలంకషంగా సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేడారం లో కోనసాగుతున్న అభివృద్ధి పనులపై, ప్రాకారం లోపల,సివిల్ పనులు, గద్దెల ఎత్తు పెంచడం, నిర్మాణం , ప్రధాన ద్వారాలు, ఆర్చ్, 4 వాచ్ టవర్లు, ప్రాకారనికి చుట్టూ సిసి రోడ్డు పనులను సమాంతరంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. దీనికితోడుగా గ్రీనరీ, ప్లాంటేషన్ చేయాలన్నారు. కావలసిన గ్రానైట్ వేగవంతంగా తెప్పించుకోవాలని అన్నారు.మెన్ మెటీరియల్ పెంచి 24 గంటలు పనులు జరగాలన్నారు.మేడారం లో రోడ్డు నిర్మాణ పనులు డివైడర్లు, ప్లాంటేషన్ తో సహా నెల రోజుల్లో పూర్తి కావాలి. మాస్టర్ ప్లాన్ లో భాగంగా మొదటి విడతలో క్యూ లైన్ షేడ్స్, 4 రోడ్డు లైన్ల విస్తరణ, టెంపర్ అభివృద్ధి, గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ 3 వేల నుండి 10 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. 19 ఎకరాలు భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి కోరిన విధంగా జంపన్నవాగు పై చెక్ డ్యామ్ ల ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులు తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. శాశ్వత బస్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించాలని, పర్యాటక శాఖ ద్వా రా జంపన్నవాగు అభివృద్ధి, సుందరిక రణ ప్రతిపాదనలు సిద్ధం చెయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా 4 అధునాతన పశు వదశాలల ఏర్పాటు చేయాలని తెలిపారు. మేడారం చుట్టుప్రక్కల రహ దారులకు మరమ్మతులు చేయాలి మేడారం కు వచ్చే ప్రధాన రహదారిలో ఎలాంటి అడ్డంకులు ఉ ండకుండా ప్రధాన రహదారిలో అక్కడక్కడ మిగిలి ఉన్న పనులతో పాటు మల్లంపల్లి బ్రిడ్జి, కటాక్షపూర్ బ్రిడ్జి పై ప్రత్యేక శ్రద్ధ చూపి డిసెంబర్ 15 లోగా పూర్తి కావాలని నేషనల్ హై వే అధికారు లను ఆదేశించారు.అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22 న వస్తామని, నిర్దేశిత ఆయా పనులు పూర్తి కావాలని అన్నారు. నాణ్యతతో రాజేపడేది లేదని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు,దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హారీష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్ పి శబరిష్, డి ఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సి హెచ్ మహేందర్ జి, (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ అండ్ బి, పి ఆర్ ఈ ఎన్ సి, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలి ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగు ణంగా మేడారంలో జరుగుతున్న





అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులను పూర్తి చేస్తామని, గిరిజన పూజార్ల సూచన మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు. ముందస్తు మొక్కులు చెల్లించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేస్తామని అన్నారు. వచ్చే రెండు వందల సంవత్సరాల కాలం పాటు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని, 25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, భవిష్యత్ లో 10 కోట్ల మంది భక్తులకు సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మేడారం మాస్టర్ ప్లాన్ పై త్వరలో ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఎంత డబ్బు ఖర్చు అయినా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజనుల సాంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల గద్దెల ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని, అన్ని పనులను పూర్తి చేసి రానున్న మేడారం మహా జాతరను విజయవంతం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని, గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తున్నదని వివరించారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగ గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ధేశించిన సమయంలో సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఏ. లక్ష్మణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్మ వాళ్ళను దర్శించుకుని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ దేవుళ్ళ ప్రాంతాలలో గిరిజనుల సాంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, గిరిజనుల అస్తిత్వం,ఆత్మగౌరవానికి విలువలు ఇస్తూనే పనులు చేపడుతున్నట్లు , మరో వారం రోజుల్లో గా గద్దెల ప్రాంతం ఒక రూపానికి వస్తుందని వివరించారు. భక్తులు విశ్వాసం నమ్మకంతో అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తున్నారని, వారి విశ్వాసం దెబ్బ తినకుండా ఆదివాసీల అస్తిత్వం కాపాడుకుంటూ పనులు పూర్తి చేస్తామని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్లి మాట్లాడుతూ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి అనుకున్న సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.అనంతరం సాయంత్రం 3 గంటల 40 నిమిషాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.హారీష్ హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్కు బయలుదేరారు.

# ఢిల్లీ పేలుడు కేసు

## - ఉమర్ నబీ పేరు మీద మరో కారు.. స్వాధీనం

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : ఢిల్లీ కారు బాంబు పేలుడు ఘటనకు సంబంధించిన దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎర్రకోట సమీపంలో పేలిపోయిన ఐ20 కారును నడిపిన నిందితుడి పేరు మీద మరో కారు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అది ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు అని గుర్తించారు. ఈ కారు కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి, హర్యానా రాష్ట్రంలోని ఒక గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. ఐ20 కారును నిందితుడు ఉమర్ నబీ నడిపినట్లు గుర్తించారు. అతని పేరు మీదే ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు కూడా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించి, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లు, చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని సూచనలు జారీ చేశారు. ఉమర్ నబీ పేరు మీద ఉన్న ఈ కారును గుర్తించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కారు గురించిన సమాచారం ఎక్కడైనా తెలిస్తే వెంటనే తెలియజేయాలని కారు నెంబర్, ఇతర వివరాలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. చివరకి ఫరీదాబాద్ జిల్లాలోని ఖాండవాలీ గ్రామంలో ఆ కారును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## ఢిల్లీ పేలుడు ఘటన... కేంద్రంపై నిప్పులు చెరిగిన ఖర్గే



తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది ప్రభుత్వ భద్రతా వైఫల్యమేనని, జాతీయ రాజధానిలో పాలన పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనపై ఖర్గే మీడియాతో మాట్లాడుతూ, “బాంబు పేలుడుపై పూర్తిస్థాయి విచారణ జరగాలి. నేరం చేసిన వారికి భయం పుట్టేలా శిక్షలు ఉండాలి. ఎవరికీ మినహాయింపు ఇవ్వకూడదు” అని స్పష్టం చేశారు. జాతీయ రాజధానిలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), సీబీఐ వంటి ఎన్నో కీలక ఏజెన్సీలు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, ఇది ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద సిగ్నల్ దగ్గర ఆగి ఉన్న ఓ హ్యుండాయ్ ఐ20 కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలిపోయింది. ఈ దుర్ఘటనలో కనీసం 12 మంది మరణించగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల ప్రాంతాలు దద్దరిల్లాయి. ఈ పేలుడుతో ఢిల్లీ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్జీ) వంటి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేశాయి. ప్రాథమికంగా ఇది ‘ఫిదాయీ’ (ఆత్మాహుతి) దాడి అయి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కారు ఎక్కడి నుంచి వచ్చింది, పేలుడు పదార్థాలను ఎలా తరలించారు అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదిక వచ్చాక మరింత మాట్లాడతామని ఖర్గే తెలిపారు. డిసెంబర్ 1 నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి, ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు.

## కాళేశ్వరం కమిషన్‌పై విచారణ... జనవరికి వాయిదా



తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : కాళేశ్వరం కమిషన్ విచారణను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ స్మిత సబర్వాల్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జీఎం మోయినుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇవాళ మరోసారి విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. అదేవిధంగా ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు నలుగురు పిటిషనర్లకు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటి వరకు కేసులో అంతకు ముందు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో జనవరి రెండో వారానికి మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే.

## బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం..? - రఘునందన్ రావు ఫైర్

తరంగాలు, డెస్క్, నవంబర్ 12 : ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనను బీజేపీకి ఆపాదిస్తూ కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం దేశద్రోహం కిందికే వస్తుందని ఆయన హెచ్చరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో నిర్వహించిన ‘సర్దార్-ఏక్తా పాదయాత్ర’లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. “చేతిలో ఫోన్ ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే పేలుళ్లు జరుగుతాయని, దీని వెనుక బీజేపీ ఉందని నీచంగా మాట్లాడుతున్నారు. అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?” అని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్న వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ప్రజలు ఎవరూ ఇలాంటి వారిని సమర్థించవద్దని ఆయన కోరారు. ఢిల్లీలో బాంబులు పేల్చాలని ఒక వర్గం వారు కుట్ర పన్నారని, ఇప్పుడు ఆ నెపాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఉగ్రవాద చర్యలను ఖండించాల్సింది పోయి, ఒక రాజకీయ పార్టీపై బురద చల్లడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు.



# మాదక ద్రవ్యాల నివారణ పట్ల అవగాహన కల్పించాలి

- మత్తు పదార్థాల విక్రయ దారులను కనిపెట్టాలి
- స్ఫూర్తి కార్యక్రమంలో నార్కోటిక్ అధికారులను భాగంచేసి విద్యార్థిని, విద్యార్థులకు అవేర్నెస్ కల్పించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 12, తరంగాలు: మాదక ద్రవ్యాల రవాణా, నియంత్రణ, నివారణ పట్ల అవగాహన కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు .బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జిల్లా నార్కోటిక్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కాలేజీల, ప్రాంగణంలో విద్యార్థిని, విద్యార్థులకు మత్తు పదార్థాల విక్రయ దారులను కనిపెట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో స్పూర్తి కార్యక్రమంలో నార్కోటిక్ అధికారులను భాగంచేసి విద్యార్థిని విద్యార్థులకు అవేర్నెస్ కల్పించాలని అన్నారు. ప్రస్తుత విద్యార్థులు రేపటి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దుటకు విద్యాలయాలు,సమాజం మంచి మార్గం నిర్దేశకాలు అవ్వాలని, అందుకు సంబంధిత శాఖల అధికారులు,టీచర్లు,తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని వారి రోజువారి దినచర్య ఆధారంగా వారి ప్రజ్ఞను అంచనావేసి వారిని భవిష్యత్ తరాలకు వారసులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ట్రాన్స్పోర్ట్ శాఖలు రైల్వే ,బస్సు స్టాండ్స్ ఏరియాలను తరచూ పోలీసులు పెట్రోలింగ్ చేసినట్లు అయితే మత్తు పదార్థాల నివారణ అరికట్టవచ్చు అని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనునిత్యం మత్తు పదార్థాలు రవాణాలో పెట్రోలింగ్ చేయాలని ,స్కూల్స్ కాలేజీల లోని కూడా తరచూ అవేర్నెస్ కల్పించాలని డీసీపీ ఈస్ట్ జోన్ అధికారి అంకిత్ కుమార్ సక్వాల్ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వరంగల్ శుభం, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట ఏసీపి నరసయ్య, బి రమేష్ చందర్, డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ భరత్ కుమార్ సైకాలజిస్ట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యువతి యువకుల్లో వివేకానందుని స్ఫూర్తిని నింపాలి - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద







వరంగల్ ప్రతినిధి, నవంబర్ 12,తరంగాలు : యువతి,యువకుల్లో వివేకానందుని స్ఫూర్తిని నింపాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం పోతన ఆడిటోరియంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలలో భాగంగా స్వామి వివేకానందుని జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి లు పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూల మాలలు సమర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద యువతి యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత దేనికి భయపడ కూడదని, ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గౌరవించి ప్రేమ చూపాలని, యువతీ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని , ఈ క్రీడల్లో పోటీల్లో పాల్గొనే పిల్లల్లో ఆత్మస్థిత్యం ఎక్కువగా ఉంటుందని, విద్యార్థి దశ నుండి క్రీడలు పిల్లలకు ఎంతో మేలుచేశాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపొందిన పిల్లలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. చదువుతోపాటు ఆటలు.. పోటీల్లో రాణించాలని దాని వలన మనసుకేంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయని అదే విధంగా ఇక్కడ గెలిచిన యువతి యువకులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి వరంగల్ కి కీర్తి కిరీటాన్ని నిలబెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ జి సంధ్యారాణి జిల్లా యువజన మరియు క్రీడల అధికారి అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ భుజంగారెడ్డి సైన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీకాంత్ మరియు జాతీయ జానపద కళాకారుడు ఆకులపల్లి కరుణాకర్ రాజేందర్ మౌనికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నాగేష్, రాజేందర్ రెడ్డి, చిరంజీవిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

## ముదిరాజ్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 12, తరంగాలు : ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవ పోస్టర్ ను హైదరాబాదులో బుధవారం ఆవిష్కరించిన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ మాట్లాడుతూ ఈనెల 21 ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి గ్రామాన సంఘం నాయకులు పతాకాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు చిల్లా సహదేవ్ ముదిరాజ్, ఫిషరీస్ కార్పొరేషన్ చీఫ్ ప్రమోటర్ కొత్త రమేష్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి పిట్టల ధనుంజయ్ ముదిరాజ్, ఎదురబోయిన సూరయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

# నిరంతర అభ్యాసమే విజయానికి ప్రధాన ఆయుధం

- స్కీనేదర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నైలో 54 మంది శ్రీ చైతన్య విద్యార్థుల ఎంపిక
- ప్రతి విద్యార్థికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగం కల్పించడమే శ్రీ చైతన్య ధ్యేయం





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 12,తరంగాలు : పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్‌లో స్కీనేదర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై సంస్థలో 54 మంది విద్యార్థులు వార్షికంగా రూ.3.6 లక్షల వేతనంతో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మి నారాయణ తెలిపారు. స్కీనేదర్ సంస్థ హెచ్.ఆర్. శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తక జ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ మరియు తాజా టెక్నాలజీలపై అవగాహన పెంపొందించుకోవాలి. నిరంతర అభ్యాసమే విజయం సాధించడానికి ప్రధాన ఆయుధం అని సూచించారు. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి కోసం మొదటి సంవత్సరం నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. ఈరోజు ప్లేస్మెంట్ విజయంలో అవి కీలక పాత్ర పోషించాయి. ప్రతి విద్యార్థికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగం కల్పించడమే శ్రీ చైతన్య ధ్యేయం అని తెలిపారు. కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ, విద్యార్థులు ప్లేస్మెంట్ అవకాశాలకు సిద్ధమవ్వడానికి మాక్ ఇంటర్వ్యూలు, టెక్నికల్ ట్రైనింగ్‌లు నిర్వహిస్తున్నాము. ఈ కృషి ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రతిష్టాత్మక సంస్థల్లో స్థానం సంపాదిస్తున్నారని అన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సాయి గీతిక మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యార్థులకు అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకున్నప్పుడు మాత్రమే విజయం సాధ్యం అవుతుంది. స్కీనేదర్ ఎలక్ట్రిక్ ప్రైవేట్ లిమిటెడ్ చెన్నైలో ఎంపికైన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డా. వి. సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా. రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇన్‌ఛార్జి కృష్ణ ప్రసాద్, విభాగాధిపతులు డా. ప్రణతి, డా. జ్యోతి, డా. చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి







నల్గొండ ఆర్సి, నవంబర్ 12, తరంగాలు : ప్రసవాల నిర్వహణలో నల్గొండ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రాష్ట్రంలోనే ముందుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉస్మానియా, గాంధీ తర్వాత ఎక్కువగా ప్రసవాలు నిర్వహించే అతిపెద్ద ఆస్పత్రిగా నల్గొండ జిజిహెచ్ పేరుపొందిందని, ప్రతినెల 700 నుండి 800 వరకు ప్రసవాలు చేయడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. గతంలో ఉన్న సదరం శిబిరం కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని,సౌకర్యాల లేమితో వైకల్యం కలిగిన వారు అనేక ఇబ్బందులను ఎదుర్కోవడాన్ని దృష్టిలో ఉంచుకొని 30 లక్షల రూపాయల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించి వికలాంగులకు కొత్త భవనంలో తాగునీరు, టాయిలెట్స్,ర్యాంపు,ఇతర అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. వైకల్యం కలిగిన వారు ఇక ప్రతివారం ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్టిఫికెట్లు పొందవచ్చని అన్నారు. ఇప్పటివరకు దృవపత్రాలు రాని వారికి ధ్రువపత్రాలు జారీ చేయడం జరుగుతుందని, సదరం ధ్రువ పత్రాల ఆధారంగా పెన్షన్ రాని వారికి పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు ఏ ఇతర ఆస్పత్రిలో లేవని , ఆసుపత్రిలో అన్ని అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇటీవలే బేబీ వార్మ్స్, లాప్రోస్కోపిక్ మిషన్ వంటివి ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు, మూడు లక్షల రూపాయల విలువ చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేస్తున్నామని,ఇవి సద్వినియోగం చేసుకోవాలని కోరారు .ఇంకా ఆసుపత్రికి అవ-సరమైన సౌకర్యాలను కల్పిస్తామని,అవసరమైతే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామని చెప్పారు. ప్రసవాల కోసం ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి రావాలని, ఇందుకు ఆశ, అంగన్వాడీ, ఆస్పత్రికి సిబ్బంది, అంబులెన్స్ వాహనాల డ్రైవర్లు, డాక్టర్లు కృషి చేయాలని మంత్రి అన్నారు. వైద్య సేవలలో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని రాష్ట్రం లోనే నంబర్ వన్ గా నిలపాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి,జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్ అరుణ కుమారి, ఆర్ఎంవో, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సఖి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.12, తరంగాలు : సఖి కేంద్రం మహబూబాబాద్ ఆధ్వర్యంలో జడ్పిహెచ్ఎస్ పేనుకొండ లో అవగాహన కార్యక్రమం ఈ కార్యక్రమంలో సఖి కౌన్సిలర్ సరస్వతి మాట్లాడుతూ మహిళలు బాలికలకు ఎలాంటి గృహహింసకి వేధింపులకు గురైన సఖి కేంద్రం చేత చేయబడే సహాయం గురించి వివరిస్తూ మహిళలకు వైద్యం. వసతి న్యాయపరమైన సహాయం ఉచితంగా అందించబడుతుందని చెప్పారు మహిళలు బాలికలకు ఎలాంటి సమస్య ఉన్న 181 కి కాల్ చేయాలని చెప్పారు. సఖి న్యాయ సలహాదారు ఉష మాట్లాడుతూ బాధితులకు ఉచిత న్యాయ సహాయము అందించబడుతుందని వివరించారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేసముద్రం మండల ఎంఈఓ పెనుగొండ హెచ్ ఎం. యాదగిరి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు మీ గ్రామంలో గాని మీ కుటుంబాలలో గాని ఎలాంటి గృహహింస జరిగిన బాల్య వివాహాలు జరిగిన సఖి కేంద్రం వాళ్లకి ఇన్ఫామ్ చేసి తగిన సహాయం పొందవచ్చు అని చెప్పారు. విద్యార్థిని విద్యార్థులకి అవగాహన కల్పించిన సఖీ కేంద్రం వారికి ఎంఈఓ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- వరంగల్ లో జిల్లాస్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం





వరంగల్ ప్రతినిధి, నవంబర్ 12, తరంగాలు : కమ్యూనిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని ఓసిటీ మైదానంలో జిల్లాస్థాయి జనసేవదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం అయ్యాయి. ఈ శిక్షణా శిబిరాలను ప్రారంభానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి వ్యవస్థకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దానికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు నిలబడుతున్నారని అన్నారు. భారత దేశంలో రానున్న కాలంలో మతోన్మాద, పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లనుందని అన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం పోరాడిన చరిత్ర సిపిఐది అని, భారత దేశ గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని,ఈ ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటి పార్టీగా సీపీఐ ప్రజల హృదయాలలో నిలిచిపోయిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం అంతరాలు లేని సమాజం కోసం, భూ సంస్కరణలు అమలు కోసం, పీడిత తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐ దన్నారు. అధికారం లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారికోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నదని అన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి జనసేవాదళ్ కార్యకర్త వాటి విజయవంతానికి విధిగా పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈనెల 18,19 తేదీలలో సిపిఐ బస్ జాతా జరుగనుందని, ఈ బస్ జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు జనసేవాదళ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, సంగీ ఏలేందర్, కందిక చెన్నకేశవులు, ఐయిత యాకుబ్ ఓర్సు రాజు తాళ్లపల్లి జాన్ పాల్ యండి అక్బర్ పాషా దామెర కృష్ణ పరికరాల రమేష్ దస్రు సుంకరి భవాని ల్యదల్ల శరత్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ

- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం, ఆయిల్ క్యాన్ అందజేసిన
- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి, నవంబర్ 12, తరంగాలు బాధిత కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకులు అందజేసి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అండగా నిలిచారు.రాయపర్తి మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యంగుడైన బండారి రాజు భార్య బండారి రామ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి 50 కిలోల బియ్యం, ఆయిల్ క్యాన్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు ముద్రబోయిన సుధాకర్,ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి ఎండీ యూసుఫ్ పార్టీ ముఖ్య నాయకులు చిన్నల ఉప్పలయ్య, ఎండీ అక్బర్, ఐత కుమార్, చందు మల్లేష్, మైస వెంకటేశం, గుడ్ల గురునాథం, ఎనగందుల యాదగిరి, ఉబ్బని సింహాద్రి, బల్లెం యాదగిరి, కస్రబోయిన కుమార్, కుంట రాంబాబు, పిరని వెంకన్న, బండారి అశోక్, చందు లక్ష్మన్, గారే నరేష్, ఎర్రబోయిన సంపత్, పెద్దగోని జీవన్ ఎండీ యకూబ్, ముద్రబోయిన వీర- స్వామి, ఎండీ ఖాజా, చిన్నాల సాయిలు, ముద్రబోయిన మారయ్య, ముద్రబోయిన కొమురయ్య, తుమ్మల కొమురయ్య, కుక్కల ఎల్లయ్య, పయ్యావుల కుమార్, బండి సింహాద్రి, కస్రబోయిన కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# అందె శ్రీ సాహిత్య లోక ఆణిముత్యం

- తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ కితాబు..
- అందేశ్రీ మరణం సాహితీలోకానికి తీరని లోటు
- తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన పాటలతో, సాహిత్యంతో ప్రజలను ఉత్తేజపరిచారు
- జయ జయహే తెలంగాణ గీత రచయితగా ప్రసిద్ధి
- అందె శ్రీ జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలి



కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 12, తరంగాలు : ప్రకృతి కవిగా పేరుగాంచిన అందెశ్రీ సాహిత్య లోకంలో ఆణిముత్యం అని,అతని మరణం సాహితీ లోకానికి తీరని లోటు అని, ప్రజలంతా అతని ఆశయ సాధనకై పాటుపడాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మధ్యాహ్నం కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాలలో టిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ఆధ్వర్యంలో కీర్తి శేషులు అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో జన్మించిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య అని, పేద కుటుంబంలో జన్మించిన ఈయన నాటి కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో విద్యాభ్యాసం కూడా కొనసాగించలేకపోయారని, అయినప్పటికీ సరస్వతి మాత కటాక్షంతో సాహిత్యాన్ని తన నాలుకపై నాట్యమాడించారనీ, పేద ప్రజల కష్టాలు, గ్రామీణ సామాజిక రుగ్మతలు, పరిస్థితులను తన సాహిత్యం ద్వారా జనాలకు అందించి వారిని చైతన్య పరచారని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తనదైన ముద్ర వేసిన అందేశ్రీ, తన సాహిత్యం ద్వారా తన పాటల ద్వారా ప్రజలలో ఉద్యమ చైతన్యం రగిల్చి, జనాలను ఉద్యమం వైపు నడిపించి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడడానికి కారకులయ్యారని ప్రశంసించారు. అందేశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ"అనే పాట తెలంగాణ ఉద్యమంలో కీలకంగా మారిందని, ఇప్పుడు అదే పాట తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తించబడి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిందని వివరించారు."పల్లెనీకు వందనములమ్మో" అనే పాటతో పల్లె గొప్పదనాన్ని, "మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు" పాటతో మనిషిలో అంతరించిపోతున్న మానవత్వం గురించి, "గలగల గజ్జెలబండి" పాటతో కాకతీయుల వైభవాన్ని, "కొమ్మ చెక్కితే బొమ్మరా%ా%" పాట తో గ్రామీణ దేవతల గురించి ఎంతో అద్భుతంగా వివరించారని కితాబిచ్చారు. చిత్రసంగీత రంగంలో 2006లో "గంగ" చిత్రం కోసం రాసిన "ఎల్లిపోతున్నావ తల్లి" పాటకు నంది అవార్డు కూడా లభించిందన్నారు.సాహిత్య సేవల గాను కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించిందని, 2025 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆయనకు ప్రభుత్వం రూ. కోటి నగదు పురస్కారాన్ని ఇచ్చి అతనిని గౌరవించిందని వివరించారు. చదువు లేకపోయినా, "ప్రకృతి కవి" గా ప్రసిద్ధిగాంచి గ్రామీణ జీవితం, సహజ భావాలతో రాసిన అతని సాహిత్య రచనలు చిరస్మరణీయం. అందెశ్రీ జీవితాన్ని పాఠ్యాంశాలలో పొందు పరిచాలని, ఆయన ఆశయ సాధనకై కృషి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సురేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల శాఖ కార్యదర్శి వీసం నర్సయ్య, అప్పాల నాగరాజు, ఉపాధ్యాయులు వెలమాల భాస్కర్ లు పాల్గొన్నారు.

# రామగిరి ఏకాంబ్రం భౌతిక దేహానికి పిఏసిఎస్ చైర్మన్ కొడగాని నివాళి



వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 12, తరంగాలు : రామగిరి ఏకాంబ్రం భౌతిక దేహానికి వర్ధన్నపేట పి.ఏ.సి.ఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా నివాళులర్పించి, మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. వర్ధన్నపేట పట్టణం కేంద్రానికి చెందిన రామగిరి ఏకాంబ్రం (58) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట పి.ఏ.సి.ఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా మృతుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.ఏ.సి.ఎస్ సీఈఓ వెంకన్న,మురళి,రాజు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

- మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పదివేల వేతనం ఇవ్వాలి..
- సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 12, తరంగాలు: బుధవారం రోజున కేసముద్రం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన అనంతరం సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు రాక నెలలు గడుస్తున్న తెచ్చిన అప్పుల కాడ వడ్డీలు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారని, వంట గదులు లేక వర్షాలకు కట్టెలు తడిసి కట్టెలు మండకపోవడంతో పొగతో మిడ్ డే మిల్స్ కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు పౌష్టికాహారం, అందించడంలో మధ్యాహ్న భోజన కార్మికులు ముఖ్య భూమికి పోషిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను విస్మరించి శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులకు వంటగ్యాస్ ,కోడిగుడ్లు సప్లై చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా మధ్యాహ్న భోజన కార్మికులకు నేలకురూ .10,000 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినారు. అదేవిధంగా ఈనెల 14వ తారీఖున కేసముద్రం మండల కేంద్రంలోని సిఐటియు ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగే సిఐటియు మండల మహాసభను కేసముద్రం, ఇనుగుర్తి మండలాల సిఐటియు అనుబంధ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో. జ్యోతి సుజాత శ్రీలత గాడి పెల్లి లలిత మంగమ్మ మల్లమ్మ లలిత రేణుక వినోద పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్చార్జిగా ఎలిశాల రాకేష్



వర్ధన్నపేట ప్రతినిధి, నవంబర్ 12, తరంగాలు : వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి ఎలిశాల రాకేష్ ను బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్ గా నియమిస్తూ నిమకపత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎలిశాల రాకేష్ మాట్లాడుతూ గత 3 సం. నుండి బీసీల ఐక్యత కోసం చేస్తున్న సేవలను గుర్తించి నాకు ఈ పదవి ఇచ్చినందుకు బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవి కృష్ణ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బీసీ జేఏసీ వరంగల్ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగాల శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో బీసీ కులాలను ఐక్యం చేసి నియోజకవర్గంలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయటడానికి కృషి చేస్తానని అన్నారు.

# 12 మంది సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి



మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్.12, తరంగాలు : వివిధ జిల్లాలలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లను సూపరింటెండెంట్లుగా పదోన్నతులు కల్పించి జిల్లాకు కేటాయించిన ఉద్యోగులకు బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నియామక ఉత్తర్వులు జారీచేశారు.జిల్లాకు కేటాయించిన 12 మంది సూపరింటెండెంట్లను జిల్లాలోని జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్ కార్యాలయాలలో నియామక ఉత్తర్వులను కల్పించారు.అందులో బి.వీరభద్ర రావు మహబూబాబాద్ మండల ప్రజా పరిషత్, జి. మల్లికార్జున రావు జిల్లా ప్రజా పరిషత్ నకు, నాగమల్లేశ్వర్ రావు కురవి మండల ప్రజా పరిషత్, ఏ.పృద్వీ రాజ్ గూడూరు మండల ప్రజా పరిషత్, సి.హెచ్ శ్రీనివాస్ కేసముద్రం మండల ప్రజా పరిషత్, ఎం. కృష్ణ గంగారం మండల ప్రజా పరిషత్, సిద్ది శ్రీనివాస్ దంతాలపల్లి మండల ప్రజా పరిషత్, కె.జయ కొత్తగూడ మండల ప్రజా పరిషత్, ఎస్.మహేందర్ రెడ్డి పెద్దవంగర మండల ప్రజా పరిషత్, డి.శైలజ కుమారి చిన్నగూడురు మండల ప్రజా పరిషత్,పి. రేణుక దేవి నరసింహులపేట మండల ప్రజా పరిషత్, డి.రాజేశ్వరీ తొర్రూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించి నియమించారు.

# మృతుడి కుటుంబానికి అనుమాండ్ల తిరుపతిరెడ్డి పరామర్శ



తొర్రూరు, నవంబర్ 12, తరంగాలు : బాధిత కుటుంబ సభ్యులను మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన బొమ్మన బోయిన వెంకన్న యాదవ్ తండ్రి ఐలయ్య ఇటీవల మృతి చెందాడు.విషయం తెలుసుకున్న తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంచు సంతోష్, కాంగ్రెస్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, మేరుగు మల్లేశం గౌడ్, దేవరకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వెంకన్న చిత్రపటానికి మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి నివాళి



పెద్దవంగర, నవంబర్ 12,తరంగాలు : పెద్దవంగర మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వేముల వెంకన్న ఇటీవల అమెరికాలో అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి వారి నివాసానికి వెళ్లి వేముల వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేముల వెంకన్న ప్రజల సేవలో అంకితభావంతో పనిచేసిన నేత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు సంతోష్, సీనియర్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, మెరుగు మల్లేశం గౌడ్, దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పని మంత్రి పొంగులేటి..

- జర్పుల సింధుకు రూ.1.75లక్షల
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి.
- మంగళితండాలో బాధితులకు పరామర్శ .



పాలేరు ఆర్సీ, 12నవంబర్ ( తరంగాలు) : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం కూస-ుమంచి మండలంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా పలు గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ధర్మతండాకు చెందిన జర్పుల సింధు అనారోగ్యంతో బాధపడుతుండగా గతంలో మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక చొరవతో రూ. 1.75 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సహాయం అందించినందుకు ఈ సందర్భంగా కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మంగళితండాకు చెందిన బానోత్ మంగ్యా నాయక్, ధర్మతండాకు చెందిన ధరావత్ రామోజీ నాయక్, చేగొమ్మ గ్రామానికి చెందిన బొలికొండ శ్రీనివాస్ తల్లి, చిర్రా పెద్ద వెంకన్న మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. మంగళితండాలో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.10లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రజల కష్టసుఖాల్లో తాను ఎప్పుడూ అండగా ఉంటానని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుంటుందని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు.

# హోటల్ వింటేజ్ ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



నల్గొండ ఆర్సీ, నవంబర్ 12,తరంగాలు: నల్లగొండ జిల్లా కేంద్రంలోని చర్లపల్లి బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన హోటల్ వింటేజ్ ను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆహ్లాదకరమైన ఈ వాతావరణంలో మంచి సదుపాయాలతో హైదరాబాద్ పెద్ద పెద్ద జిల్లాల స్థాయిలో ఉండే మెరుగైన సదుపాయాలతో హోటల్ వింటేజ్ ప్రారంభించడం సంతోషకరం అన్నారు. హోటల్ నిర్వాహకులు ఫాజిల్, ఆదిల్ బృందం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.హోటల్ ఏర్పాటు చేయడమే కాదు ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని మంచి శుభ్రత, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు.హోటల్ ప్రాంగణం ముందు చార్మినార్ నమూనా ఎంతగానో ఆకట్టుకుంటుందని అదేవిధంగా ఈ హోటల్లో ఫ్యామిలీకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి మంచి రూములు పార్టీ చేసుకోవడం కోసం ఏర్పాటు చేయడం మంచి అభిప్రాయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఇబ్రహీం, సమద్ పాల్గొన్నారు.

# గుండెపోటుతో కుప్పకూలిన ప్రభుత్వ ఉద్యోగి



పాలేరు ఆర్సీ,12నవంబర్ ( తరంగాలు) : కూసుమంచి మండలకేంద్రం పశువుల ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న మాడుగుల నరేందర్(48) గుండెపోటుతో మరణించారు. బుధవారం మండలంలోని తాళ్లగడ్డ తండాలో ఓ రైతుకు చెందిన పశువు డెలివరీ కష్టతరంగా మారడంతో రైతు కూసుమంచి మండల పశు వైద్యసిబ్బదికి ఫోన్ చేయగా వెంటనే స్పందించిన వైద్య సిబ్బంది తాళ్లగడ్డ తండా చేరుకున్నారు. గేదెకు వైద్యం అందిస్తున్న క్రమంలో నరేంద్ర ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోవడంతో పక్కనే ఉన్న సిబ్బంది సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. తోటి సిబ్బంది హుటాహుటిన అంబులెన్స్ రప్పించి కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యాధికారి మరణించినట్లు తెలపగా, భౌతికకాయాన్ని నేలకొండపల్లి సీహెచ్సీకి పరీక్షనిమిత్తం తరలించారు. నరేందర్ స్వస్థలం పాల్వంచ కాగా, ఆయనకు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. విధినిర్వహణలో తన భర్త ప్రాణాలు కోల్పోవడంతో భార్య రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

# మాట తప్పని మంత్రి పొంగులేటి..

- గురుకులాలకు సొంతభవనాలు నిర్మించాలి
- ఎంపీ రాజ్యసభ టైగర్ ఆర్ కృష్ణయ్య,టీఎస్ఎస్ఏ ప్రతినిధులు వ్యవస్థాపక అధ్యక్షులు కూరెళ్ల మహేష్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం



హైదరాబాద్,నవంబర్ 12, తరంగాలు: తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 26న హలో విద్యార్థి చలో భద్రాచలం విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయాలని ఎంపీ రాజ్యసభ టైగర్ ఆర్ కృష్ణయ్య పిలుపు నిచ్చారు.హైదరాబాద్ విద్యానగర్లోని టైగర్ ఆర్ కృష్ణన్న ఎంపీ రాజ్యసభ ,నివాసం వద్ద హలో విద్యార్థి చలో భద్రాచలం పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాలు,గురుకులాలకు సొంత భవనాలను వెంటనే ఏర్పాటు చేయాలని ,అదేవిధంగా 8 నెలల నుండి ఎస్సీ వసతిగృహాల్లో, బీసీ వసతి గృహాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ,ఉద్యోగులకు వేతనాలు ఇవ్వక చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఎస్సీ ,బీసీ ,ఎస్టీ ,ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ,ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేసి ప్రభుత్వం ఉద్యోగాలను ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు.ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాలకు సొంత భవనాలు మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషల్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కూరేల మహేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం అలాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థులను పట్టించుకోని పరిస్థితుల్లో ఉన్నది ,కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని వసతి గృహాలకు సొంత భవనాలు ,గురుకులాలకు సొంత భవనాలు ఔట్సోర్సింగ్ ,కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల గోస చాలా దారుణంగా ఉంది.హలో విద్యార్థి చలో భద్రాచలం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చి ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముంపు మండలాలను తెలంగాణలో కలిపి విద్యార్థులకు న్యాయం చేయాలని వారి ఇబ్బందులను గుర్తించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థి నాయకులు కూరేళ్ల ఉదయ్, ధర్మారపు చంద్రశేఖర్, నాని, నాని ,శివ, సిద్ధు, సాత్విక్, మోహన్, ప్రభుదాస్ ,బీసీ సంఘ నేతలు బీసీ సంఘ నేతలు నీలం వెంకటేష్ ,అంజి జిల్లా పెళ్లి తదితరులు పాల్గొన్నారు.

# వినయం,కరుణతో వైద్య సేవలు అందించాలి

- భూపాలపల్లికి మెడికల్ కాలేజ్ ఒక మనిహారం
- వైట్ కోట్ కేవలం దుస్తులు కాదు,అది బాధ్యతకు ప్రతీక
- ఎంపీ డా. కడియం కావ్య







జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 12, తరంగాలు : వైద్య వృత్తి కేవలం విజ్ఞానమే కాదు,మానవతా విలువల సమ్మేళనమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం నిర్వహించిన వైట్ కోట్ వేడుకలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కావ్య మాట్లాడుతూ వైట్ కోట్ కేవలం దుస్తులు కాదు, అది బాధ్యతకు ప్రతీక అన్నారు. భూపాలపల్లికి మెడికల్ కాలేజ్ ఒక మనిహారం అన్నారు. అన్ని రకాలుగా అనువైన భూపాలపల్లి వంటి ప్రాంతంలో విద్యార్థులు సీటు వస్తే సంతోషించాలన్నారు. తెలంగాణలో వైద్య విద్య విస్తరణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. రోగి శరీరాన్ని మాత్రమే కాదు, మనసును కూడా నయం చేయడం వైద్యుడి కర్తవ్యం అన్నారు. సాంకేతికత ఎంత ఎదిగినా, రోగి మాట విని అతని బాధను అర్థం చేసుకునే సహనం కోల్పోవద్ద అని సూచించారు. తాను వైద్యురాలిగా ప్రారంభించి ప్రజా సేవా మార్గంలో అడుగుపెట్టిన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. దయ, వినయం, కరుణ వైద్య వృత్తి పునాది కావాలన్నారు. అనంతరం ఎంపీ డా.కడియం కావ్య విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, కేటీపీపీ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ రాజేష్ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- మహబూబాబాద్ జిల్లా వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ లకావత్ వెంకట్



మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 12, తరంగాలు : తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ బోర్డు హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం డి.యమ్ .ఎస్.టి. మరియు డి.ఇ.సి.జి పారామెడికల్ కోర్సులకు గాను అడ్మిషన్ పొందడానికి దరఖాస్తులకు తేది 28.10.2025 నుండి తేది : 27.11.2025 వరకు పొడిగించడమైనది కావున దరఖాసులు ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్ యందు తేది : 27.11.2025 వరకు మీ యొక్క దరఖాస్తు సాయత్రం 05.00 గంటల లోపు చేసుకొనగలరు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్ లైన్ దరఖాస్తు తో పాటు కావాల్సిన సర్టిఫికెట్స్ (ఒరిజినల్) మరియు ఒక సెట్ జిరాక్స్ కాపీస్ స్వీయ ధ్రువీకరణతో మరియు రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోస్ జతపరిచి రూ. 100 /- రుసుముతోపాటు కాలేజీ ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్ నందు తేది: 27.11.2025 సాయత్రం 05.00 గంటల లోపు సమర్పించగలరు.అప్లికేషన్ లో తప్పుడు సమాచారం, సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించని యెడల అట్టి దరఖాస్తు తిరస్కరించబడుతుంది దరఖాస్తు ఫారం మరియు సూచనలకై పూర్తి వివరాలకై www.tgpmb.telangana.gov.in వెబ్సైట్ లో చూడగలరు.

# ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి భారీ జరిమానా



తరంగాలు, (ఆర్మూర్ క్రైమ్ ప్రతినిధి) నవంబర్12 : ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆఫ్ పోలీస్ అధికారి పి.సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ టౌన్ లో స్పెషల్ డ్రంక్ అండ్ఫోర్స్మెంట్ నిర్వహించారు. ఈ తనిఖీలు భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన(3) ముగ్గురు వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి పట్టణంలోని కోర్టు ఎదుట హాజరు పరచగా పదివేల రూపాయలు ఒక్కొక్కరి చొప్పున మొత్తం 30వేల జరిమానా ఆర్మూర్ రెండవ తరగతి న్యాయమూర్తి శ్రీ గట్టు గంగాధర్ జరిమానా విధించినట్లు ఆర్మూర్ సిఐ సత్యనారాయణ గౌడ్ మీడియాకు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. సిఐ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జక్కం భూమేష్ నివాసం నల్ల పోచమ్మ టెంపుల్ ఆర్మూర్ పట్టణానికి చెందిన వారిని, ముత్తన్న ఉమ్మెడ నివాసి, ఉరుసు శీను నివాసం మైలారం అని ఈ ముగ్గురు వివరాలు గుర్తించి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్ వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి పత్రాలను వెంట ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపే వాహనదారులకు మోటార్ వెహికల నూతన చట్టం 2019 ప్రకారం భారీగా జరిమానాలు పెంచిందని దానితోపాటు జైలు శిక్ష తప్పదని ప్రజలు, వాహనదారులు పోలీస్ అధికారులకు సహకరించి అడిగిన వెంటనే వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించాలని కోరుతూ.. వాహనదారుడు తమ గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలని పలు సూచనలు చేశారు.

# రైతుల సోయా కొనుగోలు ధర్నా



తరంగాలు, మద్నూర్ నవంబర్ 12 : కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ ప్రాంతంలోని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోయాబీన్ పంటను ఎంతో శ్రమతో పండించిన రైతులు ప్రస్తుతం సరైన ధరకు అమ్ముకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల పంటకు న్యాయమైన మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు.ఈ మేరకు బిచ్కుంద మార్కెట్ యార్డ్ ఆఫీస్ ముందు రైతులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. రైతులు చేతుల్లో తాళపత్రాలు, నినాదాలతో తమ ఆవేదన వ్యక్తం చేస్తూ "రైతు బతికితే దేశం బతుకుతుంది", "సోయా కొనండి %-% రైతును కాపాడండి" అంటూ నినాదాలు చేశారు.ధర్నాలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ లు. "రైతు ఒక పంట పండించడానికి రాత్రింబవళ్ళు కష్టపడతాడు. అయితే పంట పండిన తర్వాత సరైన ధర దక్కకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని మార్కెట్లో సోయా కొనుగోలు ప్రారంభించాలి. లేదంటే రైతుల ఆగ్రహం ఉద్ధృతమవుతుంది" అని హెచ్చరించారు.రైతుల ఆందోళనకు స్థానిక ప్రజా సంఘాలు, చివరగా, అధికారులకు వినతి పత్రం సమర్పించి రైతులు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు.

# దిశ సమావేశము



మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 12,తరంగాలు: జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ, (దిశ) సమావేశం కమిటీ చైర్మన్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, అధ్యక్షతన ప్రారంభమైంది.ఈ సమావేశం లో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్,అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్,జిల్లా దిశ కమిటీ సభ్యులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా అధికారులు, సంబధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలనే రైతులకు అందించాలి - ఏడీఏ సతీష్, ఏవో రామడుగు వాణి





పాలేరు ఆర్సీ,12 నవంబర్ ( తరంగాలు) : యాసంగి సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని కూసుమంచి డివిజన్ ఏడీఏ సతీష్, మండల వ్యవసాయాధికారిణి వాణి విత్తన డీలర్లకు సూచించారు. బుధవారం కూసుమంచి రైతువేదికలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడీఏ సతీష్ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలను పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే చేయాలని సూచించారు. యాసంగి ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్ ను ప్రదర్శించాలని స్టాక్ బోర్డ్ ను ధరల పట్టికను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. ఓ ఫార్మ్ పీసీలు తప్పనిసరిగా లైసెన్స్ లో పొందుపరచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు, డీలర్లు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ పనులు ప్రారంభం



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 12,(తరంగాలు): ఘనపూర్ నియోజక వర్గ ఎమ్ ఎల్ ఏ కడియం శ్రీహరి ఇటీవల విడుదల అయిన నిధులనుండి మండలలోని గ తమ్మడపల్లి ఐ గ్రామం లో ఏర్పాటు చేసిన పదిలక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ఎస్సీ కాలనీలో ఎమ్ ఎల్ ఏ ఆదేశాల మేరకు సీసీ రోడ్డు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదపాక అనిత సుధాకర్ బాబు, రడపక డానియల్,స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ గ్రామ శాఖ అధ్యక్షులు బుల్లె పరశురాములు, రడపాక రైమన్,కాంగ్రెస్ పార్టీ నాయకులురడపాక దేవదాస్,మాజీ ఉపసర్పంచలు రడపాక హరిబాబు, ప్రభాకర్,సుధాకర్, కలకోటి రవి, రడపక సాగర్, భాస్కర్,కుమార్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల బతుకులు ఆగమాగం

- **రిటైర్డ్ ఉద్యోగుల కు సంబంధించిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి**




హైదరాబాద్ నవంబర్ 12 తరంగాలు : తెలంగాణలో రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు ప్రభుత్వం అందజేయక పోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఉద్యోగులు రిటైరై 18 నెలల అవుతున్నా బెనిఫిట్స్ రాక, తమ కుటుంబ అవసరాలు తీరక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ మధ్య కాలంలో హన్మకొండ పోలీస్ స్టేషన్ రైటర్ బాలకృష్ణ మానసిక వేదనతో హార్ట్ స్ట్రోక్ వచ్చి మరణించాడు. ఇదే మండలంలో పైడిపల్లి హైస్కూల్‌లో పనిచేసి రిటైర్ అయిన జూనియర్ అసిస్టెంట్ బి లక్ష్మణ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో, మహబూబ్ నగర్ జిల్లా గండేడు మండలానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు కుడుముల కొండయ్య తీవ్ర అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులు భరించలేక చనిపోవడం జరిగింది. మిత్రులారా గుండెకు స్టంట్ వేసుకోవాలి డబ్బులు అప్పివ్వండి అని కొత్తగూడెం ఐటిఐలో సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన శ్రీనివాసరావు ఉద్యోగ జేఏసీ నాయకులను వేడుకొంటున్నాడు. ఎంతోమంది రిటైర్డ్ఉద్యోగులు అనారోగ్యంపాలై బెనిఫిట్స్ అందక వ్యధతో మనోవేదన చెందుతున్నారు. ప్రభుత్వపాలన సక్రమంగా నిర్వహించాలంటే ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకం. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విద్య, వైద్యం, రాష్ట్రంలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో పథకాలు ప్రజలకు అందాలంటే ఉద్యోగులు సక్రమంగా పనిచేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతభత్యాలు, ఇతరత్రా ప్రయోజనాలను సకాలంలో చెల్లించాలి. అట్లా చెల్లించడం ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉత్సాహంతో తమ విధులు నిర్వహిస్తారు. ఉద్యోగులు సక్రమంగా పనిచేసినప్పుడు ప్రభుత్వానికి మంచిపేరు వస్తుంది. గత ప్రభుత్వ నిర్వాకమే ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్‌మెంట్ వయస్సును 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచారు. ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరాలు మార్చి 2024 నుంచి ప్రారంభం అయింది. గత ప్రభుత్వం సైతం వేతనాలు, ఉద్యోగులకు బకాయిలు సకాలంలో చెల్లించలేదు. ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 9,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారు. 2024 మార్చి నుంచి సెప్టెంబర్ 2025 వరకు దాదాపుగా 12 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు రిటైర్ అయ్యారు. రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన పదవీ విరమణ ప్రయోజనాలైన గ్రాట్యుటీ, కమ్యుటేషన్, ఈ.ఎల్. హాఫ్-పే లీవ్ ఎన్‌కాష్‌మెంట్ లీవ్స్, జీపీఎఫ్, టీ.ఎస్.జీ.ఎల్.ఐ, జిఐఎస్, పీఆర్సి ఎరియర్స్, సర్వీసులో ఉన్నప్పుడు చేసుకున్న సరెండర్ లీవ్స్ తదితర బిల్లుల మొత్తం రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉన్నది. వారి హోదా, సర్వీస్ ఆధారంగా వారు నిల్వ చేసుకున్న జీపీఎఫ్ నిల్వలు దాదాపుగా రూ.35 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాల్సి ఉన్నవి. ఇందులో గ్రాట్యుటీ తప్ప మిగతా సొమ్ము ఉద్యోగులు దాచుకున్నదే. ఉద్యోగులు పదవీ విరమణ తరువాత శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరుకుంటారు. ఉద్యోగం చేసినంత కాలం ఉద్యోగులు తాము దాచుకున్న సొమ్ములు అందుతాయని ప్రభుత్వ నుంచి గ్రాట్యుటీ లభిస్తుందని ఆశిస్తారు. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, సొంత ఇంటి నిర్మాణం, చేసిన అప్పులు తీర్చడం ఇలా ఎన్నో ప్రణాళికలు వేసుకొని ఉంటారు.

### పెరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు.

ఉద్యోగి పదవీ విరమణ చేసినరోజునే ఆయనకు ఇవ్వవలసిన ఆర్థిక ప్రయోజనాలను అందించి, శాలువాతో సత్కరించి ప్రభుత్వ వాహనంలో ఇంటికి పంపిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ, అప్పటినుంచి ఇప్పటివరకు ఆ విధానం అమలుకావడం లేదు. మార్చి 2024 నుంచి ప్రతినెల రిటైర్డ్ ఉద్యోగులు పెరుగుతుండడం వలన బకాయిలు పెరిగిపోతున్నాయి. గత జూన్‌లో ప్రకటించిన డీ.ఏ. ఎరియర్స్‌ను ఏప్రిల్ 2024 నుంచి ఆగస్టు 2025 వరకు రిటైర్ అయినవారికి 28 వాయిదాలలో చెల్లించాల్సిన వాయిదాలను కూడా చెల్లించలేకపోతున్నారు. గత ఏప్రిల్ 2025 నుంచి రిటైర్ అయినవారికి కేవలం నెలవారి పెన్షన్ మాత్రమే చెల్లిస్తున్నారు. రిటైర్మెంట్ అయినవారికి వెంటనే వారికి రావలసిన ప్రయోజనాలు, పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో చర్చలు జరిపారు.

### రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి.

ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క మే నుంచి ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే ఒక నెల రూ.300 కోట్లు, ఇంకో నెల రూ. 280 కోట్లు విడుదలచేసి మళ్లీ విడుదల చేయకుండా ప్రభుత్వం తాను ఇచ్చిన హామీనే అమలుపరచడం లేదు.తమ బకాయిలను నెల నెలా చెల్లించక పోవడం వలన కొంతమంది ఉద్యోగులు విసిగిపోయి హైకోర్టును ఆశ్రయించగా వారికి ఆరు, కొంతమందికి పది వారాలలో చెల్లించాలని ఆదేశించింది. అయితే, కోర్టు ఆదేశాల ప్రకారం చెల్లించకపోవడం వలన చాలామంది కోర్టు ధిక్కార కేసులు వేసినా ప్రభుత్వం స్పందించడం లేదు.రిటైర్అయిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నింటిని త్వరగా చెల్లించి పెన్షనర్ల జీవితాలను, వారి కుటుంబాలను కాపాడతారని 12 వేల మంది రిటైర్మెంట్ అయిన పెన్షనర్లు ఆశతో జీవిస్తున్నారు. తమ కుటుంబాలను ప్రభుత్వం కాపాడాలని ఆశతో ఎదురుచూస్తున్నారు.

### హామీ అమలు కోసం ఎదురుచూపులు.

గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయసును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచిన పరిణామాన్ని ఈ ప్రభుత్వం భరించాల్సి వస్తుందని రిటైర్డ్ ఉద్యోగులుగా మాకూ తెలుసు. ఈ ప్రభుత్వానికి ఏర్పడిన ఆర్థిక సమస్యలు కూడా తెలుసు. కానీ రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఆగిపోతే రిటైర్డ్ ఉద్యోగుల బతుకులు ఎంత ఆగమైతున్నాయో ఈ ప్రభుత్వం అర్థం చేసుకొని న్యాయం చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లింపుతోబాటు, బకాయిలను చెల్లిస్తామని తెలిపారు. పీఆర్సీ అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ తో అన్ని రకాల జబ్బులకు అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందించేవిధంగా హెల్త్ కార్డులు జారీచేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తాం అని కూడా హామీలు ఇచ్చారు. ప్రభుత్వాన్ని కొత్తగా గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నాం. కడారి భోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఎంప్లాయీస్ (బెనిఫిట్స్) సాధన కమిటీ.

# పెద్ద మొత్తంలో నగదు ఆభరణాలు ఇంట్లో ఉంచుకోకూడదు

## - ఎస్ఐ నరేష్ రెడ్డి

తరంగాలు, (చొప్పదండి) (నవంబర్ 12) : మండల ప్రజలకు పోలీసుల సూచనలు చేస్తూ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్తగా ఎవరు కనిపించినా, అనుమానాస్పద వ్యక్తులను చూస్తే వెంటనే డయల్ వందకు కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు 8712670766 నంబర్ కు సమాచారం అందించాలని ఎస్ నరేష్ రెడ్డి తెలిపారు.ఇంట్లో విలువైన వస్తువులను బహిరంగంగా పెట్టకుండా భద్రంగా ఉంచాలని ఇంటి తాళాలు, కిటికీలు సురక్షితంగా ఉండేలా లాక్ పెట్టుకోవాలని సూచించారు. రాత్రిపూట బయటకి వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసినపుడు, ఇంటి ప్రక్కన తెలిసిన వారికి చెప్పాలని ఊరెళ్ళేటప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే ఇంటి పెట్రోలింగ్ చేసేటప్పుడు గమనిస్తారని పేర్కొన్నారు.పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలు ఇంట్లో ఉంచుకోకుడదుబీ అవసరమైతే బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలని అన్నారు.అన్నీ గ్రామాలలో, పట్టణ ప్రధాన కూడళ్లలో ఆయా ప్రాంతాల ప్రజలు కలిసి కమ్యూనిటీ సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇంట్లో నేనుసైతం అంటూ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఈ




సూచనలు పాటించడం వల్ల దొంగతనాలను తగ్గించడంలో వ్యక్తిగత భద్రతను పెంచుకోవడంలో సహాయపడతాయని పోలీసులు తెలిపారు.

# 630 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 12,(తరంగాలు): మండలోని వెంకటాపూర్ గ్రామం లో నమ్మదగిన సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన సంద్ర శ్రీకాంత్ వయసు 30 సంవత్సరాలు ప్రైవేట్ జాబ్ చేస్తూ ఉంటాడు. అతని దగ్గర 630 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జఫర్గడ్ ఎస్సై రామారావు తెలిపారు. అలాగే డ్రై గంజాయి మొక్క సెల్ ఫోన్ సీజ్ చేసి రిమాండ్ నిమిత్తం జనగామ కోర్టుకు హాజరు పరచడం జరిగింది

# ఘనంగా సింగపురం ఇందిరా జన్మదిన వేడుకలు...



జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 12,(తరంగాలు) : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా కార్యాలయంతో పాటు మండలాల కేంద్రంలోని ప్రధాన కూడలితోపాటు వివిధ గ్రామాల్లో ఇందిరా జన్మదినం సందర్భంగా కేకులు కట్ చేసి పేద ప్రజలకు పంపిణీ చేశారు. ఇందిరా జీవితంలో ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ,మండలాల, గ్రామాల ముఖ్య నాయకులు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# వెలుగని హైమాక్స్ లైట్స్




జఫర్గడ్ ప్రతినిధి, నవంబర్ 12, (తరంగాలు) : మండలం లోని కూనూర్ గ్రామం లో ఉన్న హైమస్ లైట్స్ ఒక్కటి కూడా పనిచేయడం లేదు అధికారులను అడిగితే క్రాంట్రాక్ట్ వాళ్ళ కి ప్రభుత్వం కి మధ్య లీజ్ పూర్తి అయ్యింది అంటున్నారు. కానీ ఏమ్మెల్యే ల ఎంపీ ల అధికారుల ఇంటి దగ్గర్లో ఉన్న హైమస్ లైట్స్ మాత్రం ఎప్పుడు వెలుగుతూనే ఉంటాయి వారి దగ్గర్లో ఉన్న హైమస్ లైట్స్ కి ఎలాంటి ఆంక్షలు ఉండవు గ్రామాలలో ఉన్న లైట్స్ వరకు రాగానే 100 సమస్యలు అడ్డంకులు చెప్తున్నారు.అలాగే మండలం లో రోడ్లు సరిగా లేక లైట్స్ సరిగా లేక బస్ లు లేక పంట నష్టం ఇవ్వకుండా విద్యార్థుల నుండి రైతుల వరకు ఇబ్బందులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని బీజేపీ మండల అధ్యక్షులు కోరుకొప్పుల నగేష్ గౌడ్ అన్నారు.

# ‘గ్లోబ్ ట్రాటర్’ నుంచి ప్రియాంక చోప్రా డైనమిక్ లుక్ విడుదల

సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్... సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న ‘గ్లోబ్ ట్రాటర్’ సినిమా నుంచి ఓ అదిరిపోయే అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. ఈ చిత్రంలో ‘మందాకిని’ అనే పాత్రలో ప్రియాంక కనిపించనున్నారు. And now she arrives... Meet MANDAKINI (ఆమె వస్తోంది... ఆమే మందాకిని) అనే క్యాప్షన్‌తో దర్శకుడు రాజమౌళి తన సోషల్ మీడియా ఖాతాలో ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ లుక్‌లో ప్రియాంక చోప్రా చీరకట్టులో, హీల్స్ ధరించి, చేతిలో పిస్టల్ తో ఎంతో డైనమిక్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచే శారు. ఈ పోస్టర్ విడుదలైన క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహేశ్-రాజమౌళి సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ అప్డేట్ కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. RRR చిత్రం తర్వాత రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో సాగే గ్లోబల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మహేశ్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, పాన్-వరల్డ్ స్థాయిలో ఈ సినిమాను శ్రీ దుర్గా ఆర్ట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే క్రూరమైన విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఇక రాజమౌళి ఆస్థాన సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తాజాగా ప్రియాంక చోప్రా ‘మందాకిని’గా పరిచయం కావడంతో ఈ ప్రాజెక్ట్ పై హైప్ ఇంకాస్త పెరిగింది.




# సినిమా వార్తలు

## ప్రభాస్ ‘స్పిరిట్’ సినిమాలో చిరంజీవి లేదు – సందీప్ వంగా



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రానున్న భారీ యాక్షన్ చిత్రం ‘స్పిరిట్’. ‘అర్జున్ రెడ్డి’, ‘యానిమల్’ వంటి బ్లాక్‌బస్టర్‌ల తర్వాత సందీప్ వంగా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. అయితే, గత కొంతకాలంగా ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి ఓ కీలక పాత్ర పోషిస్తున్నారంటూ వస్తున్న వార్తలకు సందీప్ వంగా ఫుల్‌స్టాప్ పెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, ఈ పుకార్లపై స్పష్టత ఇచ్చారు. ““స్పిరిట్’ సినిమాలో చిరంజీవి గారు నటిస్తున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దు. అయితే, నేను ఆయనకు పెద్ద అభిమానిని. భవిష్యత్తులో మెగాస్టార్‌తో తప్పకుండా ఓ సినిమా చేస్తాను. కానీ అది ‘స్పిరిట్’ మాత్రం కాదు” అని ఆయన తేల్చిచెప్పారు. దీంతో ఈ క్రేజీ కాంబినేషన్‌ను తెరపై చూడాలనుకున్న మెగా అభిమానుల్లో కొంత నిరాశ వ్యక్తమవుతోంది. ‘స్పిరిట్’ సినిమాకు సంబంధించి కాస్టింగ్ విషయంలో మొదటి నుంచి అనేక వార్తలు వస్తున్నాయి. మొదట ఈ చిత్రంలో కథానాయికగా దీపికా పదుకొణెను సంప్రదించారు. కానీ, ఆమె కొన్ని కండిషన్లు పెట్టడంతో పాటు, దర్శకుడితో అభిప్రాయ భేదాలు రావడంతో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత ‘యానిమల్’ ఫేమ్ త్రిప్తి డిమ్రిని హీరోయిన్‌గా అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇంకా చిత్రీకరణ ప్రారంభం కాకముందే సినిమాపై నెలకొన్న ఈ అంచనాలు, వస్తున్న వార్తలు ప్రాజెక్ట్‌పై ఉన్న హైప్‌ను తెలియజేస్తున్నాయి. సందీప్ వంగా తాజా ప్రకటనతో చిరంజీవి పాత్రపై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

## 4K టెక్నాలజీతో ‘కొదమసింహం’ రీ రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన ట్రెండ్‌సెట్టర్ చిత్రాలలో ‘కొదమసింహం’కు ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు తెరపై వచ్చిన పూర్తిస్థాయి కౌబాయ్ చిత్రంగా అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ సినిమా ఇప్పుడు కొత్త హంగులతో మళ్లీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ఈ క్లాసిక్ చిత్రాన్ని 4%ఖ% క్వాలిటీతో రీ-మాస్టర్ చేసి, నవంబర్ 21న థియేటర్లలో గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు మెగాస్టార్ చిరంజీవి స్వయంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. “కొదమసింహం నా కెరీర్‌లో ఒక సాహసోపేతమైన ప్రయాణం. ఇది నాకొక మరపురాని ఆల్బమ్ కూడా. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ చిత్రాన్ని 4%ఖ%లో రీ-మాస్టర్ చేసి నవంబర్ 21న థియేటర్లలోకి




తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. మీ అందరి కోసం రీ-రిలీజ్ ట్రైలర్‌ను పంచుకుంటున్నాను” అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. కె. మురళీ మోహన్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో చిరంజీవితో పాటు మోహన్ బాబు, రాధ, బాలీవుడ్ నటుడు ప్రాణ్, కైకాల సత్యనారాయణ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. రామా ఫిలింస్ బ్యానర్‌పై కె. నాగేశ్వరరావు నిర్మించిన ఈ సినిమాకు రాజ్-కోటి అందించిన సంగీతం అప్పట్లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సత్యానంద్, పరుచూరి బ్రదర్స్, విజయేంద్ర ప్రసాద్ వంటి ప్రముఖ రచయితలు ఈ చిత్రానికి పనిచేశారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఈ చిత్రాన్ని 4%ఖ% రీస్టోరేషన్‌తో పాటు 5.1 సౌండ్‌తో డిజిటల్ రీ-మాస్టరింగ్ చేశారు. మెగాస్టార్‌ను కౌబాయ్ గెటప్‌లో, ఆయనదైన స్లిక్ యాక్షన్‌తో మరోసారి వెండితెరపై చూసేందుకు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## న్యాయపరమైన చిక్కుల్లో దుల్కర్ సల్మాన్ ‘కాంత’ చిత్రం



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా, టాలీవుడ్ స్టార్ రానా దగ్గుబాటి సహ నిర్మాతగా వ్యవహరించిన ‘కాంత’ చిత్రం విడుదలకు ముందే న్యాయపరమైన వివాదంలో చిక్కుకుంది. తమిళ చిత్ర పరిశ్రమ తొలి సూపర్‌స్టార్‌గా ఖ్యాతి పొందిన ఎం.కె. త్యాగరాజ భాగవతార్ జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. అయితే, ఈ చిత్రంలో తమ తాతగారిని అవమానకరంగా, వాస్తవాలకు విరుద్ధంగా చూపించారని ఆరోపిస్తూ ఆయన మనవడు త్యాగరాజన్ (64) చెన్నై సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, దుల్కర్ సల్మాన్, చిత్ర నిర్మాణ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ‘కాంత’ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. తమిళనాడు ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ అయిన పిటిషనర్ త్యాగరాజన్ తన పిటిషన్‌లో పలు కీలక అంశాలను లేవనెత్తారు. ప్రముఖుల జీవిత కథలను సినిమాగా తీయాలంటే వారి చట్టపరమైన వారసుల నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సినిమాలో పాత్రల పేర్లు మార్చినప్పటికీ, ప్రజలు సులభంగా ఇది ఎవరి కథో గుర్తుపట్టగలరని ఆయన పేర్కొన్నారు. సినిమాలో తన తాత ఎం.కె. త్యాగరాజ భాగవతార్ అనైతిక జీవితం గడిపినట్లు, కంటి చూపు కోల్పోయి, చివరి రోజుల్లో అప్పుల ఊబిలో కూరుకుపోయి మరణించినట్లు చిత్రీకరించారని త్యాగరాజన్ ఆరోపించారు. “మా తాతకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు. ఆయనకు సొంత బంగ్లా, ఖరీదైన కార్లు ఉండేవి. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా చూపించడం సరికాదు” అని ఆయన కోర్టుకు విన్నవించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన చెన్నై సివిల్ కోర్టు, నవంబర్ 18లోగా దీనిపై వివరణ ఇవ్వాలని దుల్కర్ సల్మాన్, రానాకు చెందిన నిర్మాణ సంస్థతో పాటు ఇతర ప్రతివాదులను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

## వివాదాస్పద సినిమాపై అక్కినేని కోడలు శోభిత ప్రశంసలు..

### - అమ్మాయిలు చూడాలంటూ సూచన

టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య భార్య, నటి శోభిత ధూళిపాళ ఇటీవల ఓటీటీలో విడుదలైన ఓ వివాదాస్పద తమిళ చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించారు. సినిమా చూసి తాను ఎంతో చలించిపోయానని, ముఖ్యంగా అమ్మాయిలందరూ తప్పకుండా చూడాలని కోరుతూ తన సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళ్తే, ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ నిర్మాణంలో ‘బ్యాడ్ గర్ల్’ అనే చిత్రం తెరకెక్కింది. వర్ష భరత్ కుమార్ ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమయ్యారు. సామాజిక కట్టుబాట్ల మధ్య స్వేచ్ఛగా జీవించాలని ఆరాటపడే ఓ మధ్యతరగతి యువతి కథగా ఈ చిత్రాన్ని రూపొందించారు. అయితే, టీజర్ విడుదల సమయంలో బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచేలా సన్నివేశాలు ఉన్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి.



దీంతో సెన్సార్ బోర్డు సినిమా విడుదలను నిలిపివేయడంతో ఇది వివాదాస్పదంగా మారింది. అనేక అడ్డంకులను దాటుకుని సెప్టెంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్‌లో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాను వీక్షించిన శోభిత ధూళిపాళ తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, “బ్యాడ్ గర్ల్.. నన్ను నవ్వించింది.. ఏడిపించింది. మంచి సినిమా చూసిన అనుభూతి కలిగించింది. అందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రం ఇది. ముఖ్యంగా అమ్మాయిలకు దీన్ని చూడమని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది మనకోసం తీసిన చిత్రం. వర్ష భరత్, అంజలి శివరామన్‌ను అభినందించాలి” అని రాసుకొచ్చారు. శోభిత పోస్ట్‌పై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కొందరు ఆమె అభిప్రాయాన్ని సమర్థిస్తూ సినిమాపై ఆసక్తి చూపిస్తుండగా, మరికొందరు మాత్రం ఇటీవల వచ్చిన ‘ది గర్ల్ ఫ్రెండ్’ సినిమా గురించి ఎందుకు స్పందించ లేదంటూ ప్రశ్నిస్తున్నారు.

## నెక్స్ట్ లెవెల్లో ‘లోకా’ సీక్వెల్!

‘లోకా చాప్టర్ 1: చంద్ర’ .. ఈ మధ్య కాలంలో ఎక్కువగా వినిపించిన సినిమా పేరు ఇది. కల్యాణి ప్రియదర్శన్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించాడు. దుల్కర్ సల్మాన్ ఈ సినిమాకి నిర్మాతగా వ్యవహరించాడు. 30 కోట్లతో నిర్మించిన ఈ సినిమా, 300 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ఒక లేడీ ఓరియెంటెడ్ సినిమాకి ఈ స్థాయి వసూళ్లు రావడం ఇదే మొదటిసారి అనే టాక్ బలంగా వినిపించింది. ఈ సినిమాకి సీక్వెల్ ఉంది. అందుకు సంబంధించిన హింట్ ఇస్తూనే ‘చాప్టర్1’ను ముగించారు. సీక్వెల్ ఎలా ఉండనుందనేది అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్న విషయం. కథాకథనాల విషయం అలా ఉంచితే, నిర్మాణం పరంగా భారీ బడ్జెట్ ను కేటాయించనున్నట్టు తెలుస్తోంది. అందువల్లనే దుల్కర్ తో పాటు మమ్ముట్టి కూడా ఈ సీక్వెల్ లో కనిపించనున్నాడని అనుకోవచ్చు. మమ్ముట్టి ఈ సినిమాలో చేస్తారని దుల్కర్ స్వయంగా చెప్పడం విశేషం. దుల్కర్ కథానాయకుడిగా నటించిన ‘కాంత’, ఈ నెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో ఆయన బిజీగా ఉన్నాడు. ఈ ప్రమోషన్స్ లో ఆయన మాట్లాడుతూ ‘లోకా’ సీక్వెల్ గురించి ప్రస్తావించాడు. ‘ఈ సినిమా ఫస్టు పార్టులోనే నాన్న కనిపిస్తే బాగుంటుందని భావించాను .. కానీ కుదరలేదు. సీక్వెల్ లో ఆయన తప్పకుండా కనిపిస్తారు. ఆయనతో నేను స్క్రీన్ షేర్ చేసుకునే మొదటి సినిమా ఇదే అవుతుంది” అని దుల్కర్ చెప్పారు.



Printed,Published by,Owened by **GADDAM NAGARAJU** & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463** & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**